RNI:TS-28-0030298

తెలంగాణ డైలీ న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 256 శనివారం, అక్టోబర్ 03, 2026 , పేజీలు - 06 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

తెలంగాణలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు..

12 ఏళ్ల తర్వాత పెంపు



హైదరాబాద్: తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా ఛార్జీలను పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత ఈ ఛార్జీలను సవరించడం గమనార్హం. నూతన ఛార్జీల ప్రకారం, కనీస ఛార్జీని (తొలి 1.6 కిలోమీటర్లకు) రూ. 30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ. 14 చొప్పున వసూలు చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై ఒకటిన్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ ఛార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త ఛార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. చివరి సారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో ఛార్జీలను సవరించారు. వాహనాల చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ ఛార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి..

సీఎం రేవంత్‌రెడ్డి నివాళి

- జై జవాన్ - జై కిసాన్ నినాదకర్త లాల్ బహదూర్ శాస్త్రి: సీఎం రేవంత్‌రెడ్డి
- మహాత్మా గాంధీ జీవితం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకం..
- గాంధీ మహాత్ముడి జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్‌లో ఆయన సమాధికి గవర్నర్, సీఎం నివాళులు అర్పించారు.
- గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు.



హైదరాబాద్, అక్టోబరు 2 : జాతిపిత మహాత్మా గాంధీ, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి నేడు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అహింసను ఆయుధంగా, సత్యమే మార్గంగా చేసుకుని కోట్లాది భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. సత్యం, అహింస, సహనం, మానవత్వం, సామాజిక బాధ్యత వంటి మహోన్నత విలువలను ఆచరించి, వాటి శక్తిని ప్రపంచానికి చాటిన గాంధీ జీవితం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారతరత్న, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం నిస్వార్థంగా సేవలందించిన మహోన్నత నాయకుడు అని స్మరించుకున్నారు. 'జై జవాన్ -- జై కిసాన్' అన్న నినాదంతో సైనికుడి ధైర్యాన్ని, రైతు శ్రమను దేశ ప్రగతికి రెండు బలమైన స్తంభాలుగా చాటిచెప్పిన దార్శనికుడని కొనియాడారు. నిజాయితీ, నిరాడంబరత, కర్తవ్యనిష్ఠ, దేశభక్తికి ప్రతిరూపంగా నిలిచినజీవితంనేటితరానికి ఆదర్శప్రాయమని సీఎం పేర్కొన్నారు.

రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పా

చేసి చూపిస్తున్నా



రాయలసీమ :గాంధీ జయంతి సందర్భంగా కరవుసీమలో గొప్ప కార్యక్రమం చేపట్టామని సీఎం చంద్ర బాబు అన్నారు. అక్షరాలా రూ.లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాయలసీమ కరవు పరిస్థితులు, రైతుల కష్టాలను నిర్మలా సీతారామన్‌కు పలు సందర్భాల్లో వివరించానని రైతుల బాధలను నిర్మలా సీతారామన్ అర్థం చేసుకున్నారని వెల్లడించారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 'రాయలసీమ ఉద్యాన హబ్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టా మని చెప్పారు. అలానే అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చిందని ఏ ప్రాజెక్టునైనా జయప్రదం చేసేవరకు వదిలిపెట్టని వ్యక్తి అనంత్ అంబానీ అని ప్రశంసించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు ముందుకొచ్చిన అనంత్ అంబానీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2026 అక్టోబర్ 2 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు.సాగునీరు ఇస్తే బంగారం పండిస్తారు: రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పానని అలానే చేసి చూపిస్తున్నానని సీఎం అన్నారు. తాను, పవన్, మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ నిధులిచ్చి ఆదుకున్నారని తెలిపారు. సీమ దశ, దిశ మార్చి గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు తీసుకొచ్చామని, కరవు నేలను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్ కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు.

ప్రజా రవాణాను ఏకీకృతం చేసే దిశగా కీలక

అడుగు వేశాం



హైదరాబాద్, అక్టోబరు 2 : హైదరాబాద్‌లో ఆర్టీసీ, మెట్రో ఉమ్మడి కామన్ ట్రావెల్ పాస్ (శుక్రవారం) నుంచి అందుబాటులోకి వస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అన్ని మెట్రోస్టేషన్లలో ఈ పాస్ జారీ చేస్తారని వెల్లడించారు. ఈ పాసుతో ూ== పరిధిలోని సిటీ బస్సులు, మెట్రోలో ప్రయాణించవచ్చని చెప్పుకొచ్చారు. ఈ కామన్ పాసుపై సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.పరిధిలోని సిటీ బస్సుల్లో ఈ పాస్ చెల్లుబాటవుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బస్సు -- మెట్రోకు ఇక రెండో టికెట్ అవసరం లేదని తెలిపారు. 25 లక్షలకు పైగా బస్సు ప్రయాణికులకు ఈ కామన్ పాసుతో ప్రయోజనం ఉంటుందని చెప్పుకొచ్చారు. 4.5 లక్షల మంది మెట్రో ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. మెరుగైన లాస్ట్‌మైల్ కనెక్టివిటీపై తాము ఫోకస్ పెట్టామని అన్నారు. ప్రజా రవాణాను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగు వేశామని తెలిపారు. హైదరాబాద్‌ను 'ఫ్లాస్టెస్ట్ సిటీస్'లో ఒకటిగా మార్చడమే లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.కాగా, ఆర్టీసీ బస్ - మెట్రో రైల్ కలిపి రోజు, నెల వారి పాసులను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ జారీ చేసింది. రోజు వారి పాస్ రూ.400, నెల వారి పాస్ రూ.8500 ఖరారు చేసింది. ఆర్టీసీ బస్సుల్లో ఆన్‌లైన్ టికెటింగ్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది.

'కెప్టెన్ మచ్చార్ ధైర్యాన్ని ఎందుకు మెచ్చుకోలేదు'..

కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఫైర్



ఢిల్లీ, అక్టోబర్ 2: కెప్టెన్ మచ్చార్ సాహసాన్ని చూసి యావద్భారతం గర్వపడుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మరో 9/11 తరహా ఘటన జరగకుండా ప్రాణాలను పణంగా పెట్టడాన్ని, అతని ధైర్యసాహసాలను చూసి యావత్ ప్రపంచం హర్షించిందని తెలిపారు. భారతీ యుడు ప్రదర్శించిన ధైర్యసాహసాలను గుర్తించి, అభినందించాలన్న ఇంగిత జ్ఞానం కూడా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు లేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. అర్థం పర్థంలేని అంశాలపైనా స్పందించి, తాను ప్రపంచాన్ని మారుస్తున్నట్లు మాట్లాడే రాహుల్ గాంధీ.. ఈ ఒళ్లు గగుర్పొడిచే సందర్భం గురించి, కెప్టెన్ స్మిత్ మచ్చార్ గురించి మాట్లాడటం సంగతి పక్కనపెడితే.. కనీసం ఆయన ధైర్యసాహసాలను అభినందిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్ కూడా చేయలేకపోయారని విమర్శించారు. అసలు సోనియా గాంధీ కుటుంబం ప్రాబ్లమ్ ఏంటి అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. భారత్ గురించి, భారతీ యుల గురించి ఏదైనా మంచి జరిగితే, భారతీ యుల శక్తి, సామర్థ్యాలను ప్రపంచమంతా కీర్తిస్తే వారికి ఎందుకు నచ్చదని నిలదీశారు. భారతీ యుడు తన ధైర్యసాహసాలతో అంతర్జాతీయ నేతల ప్రశంసలు అందుకుంటుంటే.. నెహ్రూ కుటుంబం జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్యానించారు. మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీకి ఉన్న అలవాటు ఇది అంటూ మండిపడ్డారు. అందుకే త్వరలోనే కాంగ్రెస్ రాజకీయంగా కనుమరుగు కావడం ఖాయమని కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

మెట్రో-ఆర్టీసీ ప్రయాణానికి కామన్ పాస్..

భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 2: భాగ్యనగరంలో మెట్రో, ఆర్టీసీ సేవలకు కామన్ పాస్ అందుబాటులోకి వచ్చింది. (శుక్రవారం) ప్రజాభవన్‌లో మెట్రో - ఆర్టీసీ కామన్ పాస్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం, వివేక్, అజారుద్దీన్ పాల్గొన్నారు. సీఎంతో కలిపి 15 మంది మంత్రులకు డబ్బులు ఇచ్చి మరీ వన్ డే ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్‌ను డిప్యూటీ సీఎం కొనుగోలు చేశారు. రేపు(శనివారం) ఉదయం 10 గంటలకు బేగంపేట నుంచి ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ద్వారా మెట్రోలో భట్టి విక్రమార్క, మంత్రులు ప్రయాణం చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడు తూ.. హైదరాబాద్‌లో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచలోనే తలమానికంగా ఉండేలా తీర్చి దిద్దుతున్నామని అన్నారు. భాగ్యనగరం దేశానికి దశదిశలా మారేలా చేస్తున్నామని చెప్పారు.మోస్ట్ లివబుల్‌సిటీగా హైదరాబాద్..హైదరాబాద్ మహా నగరంలో ప్రస్తుతం రూ.52,000 కోట్ల పనులు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఫేజ్ -2 లో రూ.38,000 కోట్ల మెట్రో పనులు చేపడుతున్నామని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్ 366 కి.మి లతో. రూ.30, 627 అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు.



21 రేడియల్ రోడ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని అన్నారు. మూసి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. 30వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మోస్ట్ లివబుల్ సిటీగా హైదారాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామన్నారు. హైదారాబాద్‌లో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే తిప్పాలని చూస్తున్నామని, ఆటోలకు రెట్రో ఫిట్‌మెంట్‌ను తీసుకొచ్చామని చెప్పారు. హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

మహాత్మా గాంధీకి ప్రధాని మోదీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి నివాళి

న్యూ ఢిల్లీ :

జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరిగాయి. దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు గాంధీ, శాస్త్రికి నివాళులర్పించారు. ఉదయం రాజ్‌ఘాట్‌కు చేరుకున్న వారు గాంధీజీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం విజయ్‌ఘాట్‌ను సందర్శించి లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. రాజ్‌ఘాట్‌లో నిర్వహించిన సర్వధర్మ ప్రార్థనలోనూ ప్రముఖులు పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు మహాత్మా గాంధీకి పుష్పాంజలి ఘటించారు. దిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నికలోనూ

గెలిచేది కాంగ్రెస్సే



నల్లగొండ, అక్టోబర్ 2: ఖైరతాబాద్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌దే విజయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు(శుక్రవారం) ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మాట్లాడుతూ.. సిట్టింగ్ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చనిపోయినా సింపతీ లేకుండా కాంగ్రెస్ పార్టీనే గెలిచిందని చెప్పుకొచ్చారు. దీంతో ఖైరతాబాద్ ఉప ఎన్నికలోనూ గెలిచేది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. డిసెంబర్ నాటికి హైదరాబాద్ - విజయవాడ 65 హైవేపై అన్ని బ్లాక్ స్పాట్స్ పనులు పూర్తి అవుతాయని చెప్పారు. ఎస్-ఎల్‌బీసీ పనులు 600 మీటర్లు పూర్తి చేశామన్నారు. జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తామని ప్రకటించారు.అమెరికాలో ఐదేళ్లు జాబ్ చేస్తే మూడు ఫైవ్ స్టార్ హోటల్స్ కొనొచ్చు అంటే అంతా అమెరికా పోతారంటూ మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యలు చేశారు. 20 ఏళ్లు అమెరికాలో ఉన్నవాళ్లు కూడా చిన్న ఇళ్లు కొనలేరని... కేటీఆర్ సంపన్నుడని ఆయనే ఒప్పుకున్నారని అన్నారు. కేటీఆర్ ధనికుడు, వందల ఎకరాలు, ఫాంహౌస్‌లు ఉన్నాయని.. కరవు వచ్చినా రైతులకు లక్ష చొప్పున సహాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులకు సరిపోను కరెంట్ ఇచ్చామని.. ప్రస్తుతం పంటలు కోతకు వచ్చాయని తెలిపారు. పక్క రాష్ట్రంలో యూనిట్ రూ.10కి కొని కరెంట్ ఇచ్చామన్నారు. కరవు వచ్చిందని వాళ్లు సంతోష పడుతున్నారని... తాము బాధ పడుతున్నామని చెప్పుకొచ్చారు. పోయిన సారి కంటే వరి సాగు 5% తగ్గిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

గాంధీ మార్గం అందరికీ ఆదర్శం

- పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్



పరిగి, అక్టోబర్ (తెలంగాణ డైలీ న్యూస్) :
జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన శాంతి అహింసల మార్గం, ఆయన అనుసరించిన విధానాలు భావి తరాల వారందరికీ ఎప్పటికీ ఆదర్శనీయమని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ అన్నారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఘనంగా నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు.?ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గాంధీ జయంతిని భక్తిశ్రద్ధలతో, సర్వమత ప్రార్థనలతో నిర్వహించడం మనందరికీ ఆనవాయితీగా వస్తోందని, అందులో భాగంగానే ఈ ఏడాది కూడా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం ఉత్సవాలు నిర్వహించడానికే పరిమితం కాకుండా, గాంధీజీ ఆశయాల సాధన కోసం మనమందరం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాపూజీ సిద్ధాంతాలను, విలువలతో కూడిన ఆయన విధానాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అలవర్చుకోవడం ద్వారా బలమైన దేశభక్తిని, మానవీయ విలువలను పెంపొందించుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పంతులు, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురామ్ రెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, లాల్ కృష్ణ ప్రసాద్, కౌన్సిలర్లు యూసుఫ్, బాలరాజు, ఆరిఫ్ పటేల్, చంద్రయ్య, బాదం అఖిల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు ఆసం ఆంజనేయులు, అక్బర్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేఖ రెడ్డి, అబ్దుల్ గని తదితరులు, పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో ఓ వ్యక్తి దారుణ హత్య



తాండూర్, అక్టోబర్ 3(తెలంగాణ డైలీ న్యూస్) :వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తిని దుండగులు అత్యంత క్రూరంగా హత్య చేశారు.మృతుడి శరీరంపై కత్తిపోట్లు స్పష్టంగా కనిపించడంతో ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. మృతి చెందిన వ్యక్తిని తాండూరు పరిధిలోని సాయిపూర్ ప్రాంతానికి చెందిన మున్వర్‌గా స్థానికులు గుర్తించారు.సమాచారం అందుకున్న వెంటనే తాండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించడంతో పాటు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన మున్వర్ హత్యపై మాకు సమాచారం అందిన వెంటనే మా రెస్క్యూ, క్రైమ్ బ్రాంచ్ టీమ్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మృతదేహంపై ఉన్న గాయాలను బట్టి ఇది కక్ష సాధింపు చర్యగా లేదా పాత కక్షల నేపథ్యంలో జరిగిన హత్యగా ప్రాథమికంగా అనుమానిస్తున్నాము. ?ఘటనా స్థలం చుట్టూ ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నాము. నిందితులు ఎవరి వైపు నుంచి వచ్చారు, ఎటు పారిపోయారనే కోణంలో గాలింపు చర్యలు చేపట్టాము. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటాము. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నమ న్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తును ముమ్మరం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలి..

- టీయూడబ్ల్యూజే హెచ్-143" ఆధ్వర్యంలో నిరసన..



మహబూబ్‌నగర్, : అక్రిడిటేషన్ కలిగిన గుర్తింపు పొంది జర్నలిస్టులందరికీ ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న మాదిరిగానే ఆరోగ్య రక్షణ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ, జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ "టీయూడబ్ల్యూజే హెచ్-143" ఆధ్వర్యంలో ఉత్తరాల ఉద్యమాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది రోజులపాటు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.ముందుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టులు ప్రదర్శనగా ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని నినాదాలు చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా తమ డిమాండ్లను తెలియజేసేలా ఉత్తరాల ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రతి జర్నలిస్టు పోస్టుకార్డుపై తమ సమస్యలు, డిమాండ్లను రాసి ముఖ్యమంత్రికి చేరేలా కార్యక్రమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి. జర్నలిస్టుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి మండలం, పట్టణం, జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టులు ఈ ఉత్తరాల ఉద్యమంలో భాగస్వాములు కావాలని, తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో "టీయూడబ్ల్యూజే హెచ్-143" మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు వరంగల్ శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల వెంకటేష్, "టీఈఎంజేయూ" జిల్లా అధ్యక్షుడు సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠ, గుర్తింపు కమిటీ సభ్యులు రవి, నవాబుపేట మండల అధ్యక్షుడు వెంకట్ రాములు, ప్రధాన కార్యదర్శి వీరేష్, భూత్పూర్ మండల అధ్యక్షుడు యాదగిరి, డెస్క్ జర్నలిస్ట్ అధ్యక్షుడు కే. శ్రీనివాస్, కమిటీ సభ్యులు శంకర్ నాయక్, విజయ్, హన్వాడ మండల అధ్యక్షుడు కార్తీక్, నాయకులు మణి ప్రసాద్, కృష్ణ యాదవ్, చంద్రశేఖర్ గౌడ్, అల్తాఫ్ హుస్సేన్, అంజి, గోపి, కిరణ్, కరుణాకర్, నీలేష్, నర్సింగ్ రెడ్డి, సత్యనారాయణ తదితరులతో పాటు జిల్లాలోని పలువురు జర్నలిస్టులు, తదితరులు, పాల్గొన్నారు.

అక్టోబర్ 4న 'సేవారత్న' డాక్టర్ వెన్న ఈశ్వరప్ప జన్మదిన వేడుకలు





మహబూబ్‌నగర్, అక్టోబర్ 3 (తెలంగాణ డైలీ న్యూస్) :
సమాజ సేవలో నిరంతరం తరిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిన "సేవారత్న" అవార్డు గ్రహీత, ప్రియతమ నేత డాక్టర్ వెన్న ఈశ్వరప్ప జన్మదిన వేడుకలను అక్టోబర్ 4వ తేదీ ఆదివారం నాడు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లను ఆహ్వాన కమిటీ సభ్యులు మరియు అభిమానులు పూర్తి చేశారు. మహమ్మదాబాద్ మండలం, సంచర్ల గేట్ వద్ద ఉన్న పల్లవి ఆడిటోరియంలో ఉదయం 10:00 గంటల నుండి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ జన్మదిన మహోత్సవానికి ఆలంపల్లి కెంపిన మఠం మరియు శ్రీ శాంత లింగేశ్వర విరక్త మఠానికి చెందిన పూజ్య శ్రీ మ.ని.ప్ర డాక్టర్ చెన్న బసవ ప్రభు మహా స్వాములు విచ్చేసి తమ దివ్య ఆశీస్సులను అందించనున్నారు. అలాగే ఈ వేడుకకు రాజ్యసభ సభ్యులు బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కె.ఎస్. రవికుమార్, హరిప్రియ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. హరికృష్ణ విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు.ఈ కార్యక్రమం కేవలం ఒక జన్మదిన వేడుక మాత్రమే కాకుండా, ప్రజలందరూ ఏకమై తమ అభిమాన నేతపై ప్రేమను చాటుకునే సువర్ణావకా శమని నిర్వాహకులు తెలిపారు. కావున నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా విచ్చేసి, పూజ్య స్వామీజీ ఆశీస్సులు పొంది, డాక్టర్ వెన్న ఈశ్వరప్పకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆహ్వాన కమిటీ, అభిమానులు కోరారు.

ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనం



?పరిగి, అక్టోబర్ (తెలంగాణ డైలీ న్యూస్) :
తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పిఆర్టియు) మండల శాఖ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీజీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శుక్రవారం పరిగిలోని గాంధీ విగ్రహం వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీజీని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే శాంతి, సహనం, అహింస వంటి అత్యుత్తమ విలువలను పెంపొందిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. గాంధీజీ జీవిత విశేషాలను, లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని అందరూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.అనంతరం పరిగి బాలసదనంలోని విద్యార్థుల కు పండ్లు, పెన్నులు ఇతర విద్యా సామగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో పరిగి మండల అభివృద్ధి అధికారి హరిప్రియ రెడ్డి, పరిగి మండల విద్యాధికారి అంజయ్య, దోమ మండల విద్యాధికారి వెంకట్, ప్రధానోపాధ్యాయులు ఎమ్. గోపాల్, సుభాష్, లాల్యా నాయక్, కృష్ణారెడ్డి, పిఆర్టియు పరిగి మండల శాఖ అధ్యక్షులు మంచనపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డి. మనోహర్, గౌరవ అధ్యక్షులు ఉస్మాన్ అలీ, పూడూరు మండల శాఖ అధ్యక్షులు ఈ. అంజిలయ్య, దోమ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సింగ్, కుల్కచర్ల మండల శాఖ అధ్యక్షులు శ్యామ్ సుందర్, బొంరాస్‌పేట్ మండల ప్రధాన కార్యదర్శి శశిధర్ కుమార్ పాల్గొన్నారు.అలాగే రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామాంజనేయులు, గిరిమోని గోపాల్, మధుసూదన్, జహంగీర్, రాష్ట్ర నాయకులు వీరేశం, శ్రీశైలం, రాజశేఖర్ రెడ్డి, కిష్టయ్య, ప్రకాశ్, బుగ్గయ్య, వేణుగోపాల్, కుందేటి వెంకటయ్య, జిల్లా నాయకులు నిరంజన్ రెడ్డి, రాకేష్, బాల్‌రాజు, జైపాల్ రెడ్డి, విరానందం, ఇబ్రహీం, నర్సిములు, బస్వరాజు, నర్సింహరాజు, భీమయ్య, ప్రవీణ్, భీమ్యనాయక్, ఆదిశంకర్, రవి, రాంచందర్, శ్రీనివాస్, సూరి, సత్యనారాయణ, వీరప్ప, సాయిలు, రామచందర్ రెడ్డి, నాయక్, నర్సిములు, చంద్రశేఖర్ రెడ్డి, చైతన్య , పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు గుడ్ న్యూస్.. ఛార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో



హైదరాబాద్, అక్టోబర్ 2: ఆటో కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆటో ఛార్జీలను పెంచుతూ జీవో విడుదల చేసింది. పెరిగిన ఇంధనం ధరలు, వాహన నిర్వహణ, ఇన్సూరెన్స్, ఇతర నిర్వహణ ఖర్చుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆటో డ్రైవర్లకు సముచిత ఆదాయం కల్పించడంతో పాటు ప్రయాణికులపై అధిక భారం పడకుండా ఛార్జీలను సవరించినట్లు వెల్లడించింది.తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.20 నుంచి రూ.30 వరకు విధించగా.. ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14 వరకు చెల్లించాల్సి ఉంటుంది. డిటెన్షన్ ఛార్జీలను నిమిషానికి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచింది. అర్హత ఉన్న ప్రతి లగేజీ ప్యాకేజీపై ఛార్జీని 25 పైసల నుంచి 50 పైసలకు పెంచింది. అయితే.. గరిష్ఠ లగేజీ పరిమితి 100 కిలోలుగానే కొనసాగిస్తున్నట్లు పేర్కొంది.ఇక.. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు 1.5 రెట్లు అధిక ఛార్జీలను యథాతథంగా విధించుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. మీటర్ల రీసెట్టింగ్‌కు 3 నెలల గడువునిచ్చింది. అప్పటివరకు ఆటోల్లో పాత, కొత్త ఛార్జీల టారిఫ్ కార్డును తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఛార్జీలు 2014 ఫిబ్రవరి 14న జారీ చేసిన +.ూ.వీం.చీశీ.20 ప్రకారం నిర్ణయించినవి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన ఛార్జీలే తెలంగాణలో

ఖైదీలు సన్మార్గంలో నడవాలి

- భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి: కలెక్టర్ కె.హరిత

- గాంధీ జయంతి సందర్భంగా జన్కపూర్ జైలు సందర్శన



కొమరం భీం, అక్టోబర్ 2 :

ఖైదీలు గతంలో జరిగిన తప్పుల గురించి ఆలోచిస్తూ ఉండకుండా భవిష్యత్తుపై దృష్టి సారించి సన్మార్గంలో నడవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా శు క్రవారం జిల్లా కేంద్రంలోని జన్కపూర్ జైలును ఆమె సందర్శించారు.జైలులో గడిపే సమయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని, బయటకు వెళ్లిన తర్వాత కుటుంబం, సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించాలని ఖైదీలకు సూచించారు. భవిష్యత్తులో ఉపాధికి ఉపయోగపడేలా జైలులో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఖైదీలకు గాలి, నీరు, వెలుతురు, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ వంటి సౌకర్యాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. చదువుపై ఆసక్తి ఉన్నవారు ఓపెన్ స్కూలింగ్, దూరవిద్య, ఓపెన్ యూనివర్సిటీ కోర్సుల ద్వారా ఉన్నత చదువులు కొనసాగించవచ్చన్నారు.కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అనూష, అదనపు ఎస్పీ చిత్తరంజన్, జైలర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో వన్యప్రాణుల వారోత్సవాల ర్యాలీ

అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అక్టోబర్ 7 వరకు వారోత్సవాలు



కొమరం భీం, అక్టోబర్ 2 :

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో వన్యప్రాణుల వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2 నుంచి 7 వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.అటవీ డివిజనల్ అధికారి టి.భార్గవ్‌కుమార్, కాగజ్‌నగర్ అటవీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అటవీ శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణుల పాత్ర కీలకమని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

బెజ్జూరులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఎన్నిక

మండల అధ్యక్షుడిగా ఆత్రం బక్కయ్య



బెజ్జూరు, అక్టోబర్ 2 : మండల కేంద్రంలో శుక్రవారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆత్రం బక్కయ్య, నిర్వహణ అధ్యక్షుడిగా గోరంట్ల వసంత్, ప్రధాన కార్యదర్శిగా కాజా రహీముద్దీన్, కోశాధికారిగా వసంత్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు రామ్‌చందర్ తెలిపారు.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దాదాపూర్ లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



దోమ, అక్టోబర్ (తెలంగాణ డైలీ న్యూస్): వికారాబాద్ జిల్లా మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు గాంధీ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కృష్ణవేణి, ఆధ్వర్యంలో ఈ వేడుకలు చాలా నిరాడంబరంగా ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గ్రామ ప్రజలందరూ మహాత్మ గాంధీ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామ సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ, మహాత్మ గాంధీ కేవలం ఒక వ్యక్తి కాదని, ఆయనో గొప్ప శక్తి మరియు అహింసా మార్గానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆయన చూపిన అహింసా మార్గమే దేశ స్వాతంత్ర్యానికి ప్రధాన ఆయుధంగా మారిందని, జాతిపితగా మహాత్మ గాంధీ అందించిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. శాంతియుత పోరాటం ద్వారా మన హక్కులను ఏ విధంగా కాపాడుకోవాలో గాంధీజీ మనకు నేర్పించారని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని, సమాజంలో శాంతిభద్రతలను కాపాడాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. మహాత్మ గాంధీ ఆశయాల సాధన కోసం గ్రామ అభివృద్ధిలో అందరూ ఐక్యంగా కలిసికట్టుగా పనిచేయాలని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.?ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొగులయ్య కూడా పాల్గొని గాంధీజీ జీవిత విశేషాలను గ్రామస్తులతో పంచుకున్నారు. దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని, గ్రామంలో పరిశుభ్రతను పాటించడం ద్వారా స్వచ్ఛ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ వేడుకల్లో గ్రామ ఉపసర్పంచ్ తో పాటు పలువురు వార్డు సభ్యులు, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ త్యాగాలు మరువలేనివి.

- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



పరిగి, అక్టోబర్ 3 (తెలంగాణ డైలీ న్యూస్) :

అహింసా, శాంతియుత పోరాటం ద్వారా మన హక్కులను సాధించుకునే మార్గాన్ని ప్రపంచానికి చూపిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పరిగి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి, పరిగి పురపాలక కౌన్సిలర్లు, భారత రాష్ట్ర సమితి నాయకులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఆశయాలు దేశ ప్రజలందరికీ ఎప్పటికీ మార్గదర్శకమని తెలిపారు. తెల్లదొరల పాలనను తరిమికొట్టేం దుకు గాంధీజీ ఎంచుకున్న సత్యం, అహింస అనే రెండు అయుధాలు ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైనవని ఆయన గుర్తుచేశారు. ఏ దేశంలోనైనా, ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా అహింసా సిద్ధాంతం ద్వారానే అతిపెద్ద సామ్రాజ్యాన్ని సైతం ఎదుర్కోవచ్చని గాంధీ ప్రపంచానికి నిరూపించి చూపారని కొనియాడారు.?ఈ దేశ భవిష్యత్తు కోసం, ప్రజల స్వేచ్ఛా వాతావరణం కోసం గాంధీజీతో పాటు ఎంతో మంది మహానీయులు తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి త్యాగం చేశారని కొప్పుల మహేష్ రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా, గాంధీజీ చూపిన మార్గం నేటి యువతకు ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో శాంతి, సమైక్యత, సోదరభావం పరిఢవిల్లాలంటే ప్రతి ఒక్కరూ గాంధీజీ చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పురపాలక కౌన్సిలర్లు మరియు భారత రాష్ట్ర సమితి నాయకులు మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తామని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు. మహాత్మా గాంధీ కేవలం ఒక వ్యక్తి కాదని, అదొక గొప్ప శక్తి అని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ప్రజా సంక్షేమం కోసం గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో పరిగి బీఆర్ఎస్ నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, , పాల్గొన్నారు.

దైవ సాక్షిగా చెపుతున్నాం మద్యం బంద్

- మాజీ సర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో ప్రమాణం చేసిన పెద్దలు, యువకులు,



పరిగి, అక్టోబర్ 3 (తెలంగాణ డైలీ న్యూస్) :

మహాత్మా గాంధీ ఆశయ సాధనే ధ్యేయంగా రాఘవపూర్ గ్రామంలో ఒక అద్భుతమైన విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ యువకులు, పెద్దలు కలిసి ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం మహమ్మారిని తరిమికొట్టేందుకు, నేటి యు వత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితా న్ని గడపాలనే ఉద్దేశంతో గ్రామస్థులంతా ఏకమై అపూర్వమైన ప్రమాణం చేశారు. దైవ సాక్షిగా సాక్షిగా రాఘవపూర్ మాజీ సర్పంచ్ నల్క జగన్, పిఏసీఎస్ మాజీ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ యువకులు అందరూ కలిసి ఇకపై ఎప్పటికీ మద్యం ముట్టబోమని, మద్యాన్ని పూర్తిగా బహిష్కరిస్తున్నామని స్పష్టమైన ప్రతిజ్ఞ చేశారు. ?ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నల్క జగన్ మాట్లాడుతూ..గాంధీ మహాత్మా ఆశించిన గ్రామ స్వరా జ్యం సాకారమవ్వాలంటే మన గ్రామం ముందుగా మద్యం రహి త గ్రామంగా మారాలి. నేడు ఎంతోమంది యువకులు మద్యం వ్యసనానికి బలై తమ విలువైన ప్రాణాలను, భవిష్యత్తును కోల్పోతున్నారు. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ దుస్థితిని మార్చాలనే ఉద్దేశంతోనే మేమంతా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆంజనేయ స్వామి సాక్షిగా మేము చేసిన ఈ ప్రమాణం కేవలం మాటలకే పరిమితం కాదు, మా ప్రాణాలను ఒడ్డినైనా ఈ నిబంధనను గ్రామంలో కఠినంగా అమలు చేస్తాం. మన రాఘవపూర్ గ్రామాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతాం.” అని జగన్ పిలుపునిచ్చారు.

– ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం.. మాజీ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి

అలాగే పిఏసీఎస్ మాజీ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మద్యం అనేది మనిషిని, కుటుంబాన్ని సర్వనాశనం చేసే మహమ్మారి. దీనికి దూరంగా ఉంటేనే సంసారాలు సంతోషంగా ఉంటాయి, పిల్లల చదువులు బాగుంటాయి. గాంధీ జయంతి రోజున మనం తీసుకున్న ఈ నిర్ణయం మన రాఘవపూర్ గ్రామం భవిష్యత్తును మలుపు తిప్పుతుంది. యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువులో, క్రీడల్లో, వ్యవసాయంలో రాణించాలి. ఈ మంచి పనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామంలో ఎవరైనా మళ్లీ మందు జోలికి వెళితే పెద్దల సమక్షంలో తగిన చర్యలు తీసుకుంటాం.” అని హెచ్చరించారు.

– యువత అంకితభావం – గ్రామస్థుల హర్షం

పెద్దల పిలుపునకు స్పందించిన రాఘవపూర్ గ్రామ యువకులు ఒక్కతాటిపై నిలిచారు. తాము ఇకపై ఎలాంటి మత్తు పదార్థాల కు, మద్యానికి బానిసలం కాబోమని, గ్రామంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. గాంధీ జయంతి రోజున రాఘవపూర్ గ్రామం తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం చుట్టుపక్కల మండలాల్లోనూ చర్చనీ యాంశమైంది. ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని చూసి పరిగి ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు మాజీ సర్పంచ్ నల్క జగన్, హనుమంత్ రెడ్డి,లను గ్రామ యువకులను అభినందించారు.

విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్.. సెంట్రల్ కిచెన్లపై సీఎం రేవంత్ ఆదేశాలివే

హైదరాబాద్, అక్టోబర్ 2: తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. ఈరోజు(శు క్రవారం) ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు అందజేశారు.అలాగే, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ అందించారు. నిధులు అందించిన సంస్థల ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు.

ఓటమిని జీర్ణించుకోలేకే కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు.

- బీసీ కమ్యూనిటీ హాల్లో గ్రామసభ పెడితే తప్పేంటి?..
- కాంగ్రెస్ నాయకుల మాటలు హాస్యస్పదం..
- ఇప్పటికైనా సిగ్గుమాలిన చర్యలు మానుకోవాలి..
- మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మిట్టకోడూరు సర్పంచ్ మాణిక్యం



పరిగి, అక్టోబర్ 3 (తెలంగాణ డైలీ న్యూస్) :

గ్రామ సభ బీసీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తే తప్పేంటని, స్థానిక ఎన్నికల్లో తమ ఓటమిని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ నాయకులు తనపై నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వికారాబాద్ జిల్లా పరిగి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, మిట్ట కోడూరు గ్రామ సర్పంచ్ మాణిక్యం తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఈ సందర్భంగా మాణిక్యం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలందరికీ అందుబాటులో, సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశంతోనే గ్రామ పంచాయతీ కార్యాలయానికి బదులుగా బీసీ కమ్యూనిటీ హాల్ భవనంలో గ్రామసభ నిర్వహించడం జరిగిందని స్పష్టం చేశారు.

?గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక, కొంతమంది కాంగ్రెస్ నాయకులు తమ ఓటమిని మనసులో పెట్టుకుని తనపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

– గ్రామస్తులకు అనుకూలంగా ఉంటుందని నిర్వహించారు.

గ్రామస్తులకు ఎంతో అనుకూలంగా ఉంటుందనే సదుద్దేశంతో పంచాయతీ భవన కాకుండా బీసీ కమ్యూనిటీ హాల్ భవనంలో గ్రామసభ నిర్వహిస్తే, దీన్ని కూడా రాజకీయం చేస్తూ కాంగ్రెస్ నాయకులు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మాణిక్యం తీవ్రంగా విమర్శించారు.

కాంగ్రెస్ నాయకుల తీరుపై మాణిక్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికారం చేతిలో ఉందని మదంతో విర్రవీగుతూ తాము ఏం చేసినా చెల్లుతుందనుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలే త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఇకనైనా కాంగ్రెస్ నాయకులు సోయి తెచ్చుకొని, బాధ్యతాయుతంగా, పద్ధతిగా మాట్లాడితే మంచిదని హితవు పలికారు. గ్రామసభ ఎక్కడ నిర్వహించాలనే కనీస అవగాహన కూడా లేకుండా, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల కోసం నిరసనలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

– హామీలపై ప్రశ్నించరెందుకు..

గ్రామపంచాయతీలో కాకుండా బీసీ కమ్యూనిటీ భవనంలో గ్రామసభ నిర్వహిస్తే నిరసనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు... మరి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఎందుకు నీరుగారుస్తోందని ఆయన నిలదీశారు. ?ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంపై మాట్లాడకుండా ఇలాంటి పనికిమాలిన విషయాలపై రాద్ధాంతం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మరి దీనిపై కాంగ్రెస్ నాయకులు ఎందుకు నోరుమెదపడం లేదని, ఇలాంటి సిగ్గుమాలిన చర్యలు మానుకో వాలని ఆయన తీవ్రమైన విమర్శలు చేశారు. ?ప్రజల సమస్యలను, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇటువంటి కుట్రలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజలకు అన్ని విషయాలు స్పష్టంగా తెలుసని, త్వరలోనే కాంగ్రెస్ నాయకుల తీరుకు ప్రజలే తగిన విధంగా సమాధానం చెబుతారని మాణిక్యం స్పష్టం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

- డబ్బా బారేగూడలో లబ్ధిదారుడికి అందజేత
- మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ



చింతలమానేపల్లి, అక్టోబర్ 2 : మండలంలోని డబ్బా బారేగూడ గ్రామానికి చెందిన బోర్లే వెంకటేశ్‌కు మంజూరైన సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు దుబ్బుల నానయ్య, ఉపాధ్యక్షుడు అంగోలా చిలకయ్య, పార్టీ నాయకులు చెక్కును పంపిణీ చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నీకోడే పెంటుబాయ్ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలి

మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

మాధవరం నగర్ కాలనీలో గాంధీ జయంతి



శేరిలింగంపల్లి, అక్టోబర్ 2: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాధవరం నగర్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థానిక నాయకులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి, సహనం వంటి గాంధీజీ చూపిన విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. స్వాతంత్ర్య సమరంలో ప్రజలను ఏకం చేసి అహింసా మార్గంలో నడిపించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సత్యం, అహింస, స్వచ్ఛత, సామాజిక బాధ్యతను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.

దివ్యాంగుల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం.

- 6,000 వేల పింఛను డిమాండ్‌తో పోరుబాట
- దీక్షకు మద్దతు తెలిపిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు
- సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్ర విమర్శలు



వికారాబాద్, అక్టోబర్ 3(తెలంగాణ డైలీ న్యూస్) :

వికలాంగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్‌లో వికలాంగులు వినూత్న రీతిలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంఘం అధ్యక్షులు రాజేష్ ఆధ్వర్యంలో ఈ దీక్ష ప్రారంభమైంది. వికలాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుపై దీక్షా శిబిరం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగుల పింఛనును రూ. 6,000 కి పెంచుతామని హామీ ఇచ్చిందని నాయకులు గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఆ హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తూ దివ్యాంగులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన ప్రస్తుత తరుణంలో, వస్తున్న నామమాత్రపు పింఛనుతో పూట గడవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

– రాజకీయ పార్టీల సంఘీభావం

వికలాంగుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల స్థానిక నాయకులు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై పోరాడుతున్న వికలాంగులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజాపాలన అందిస్తున్నామని చెప్పే సీఎం, సమాజంలో అత్యంత ఆదరణకు నోచుకోవాల్సిన వికలాంగుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి వికలాంగుల డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మహిళా సమాఖ్యలో శిక్షణ, గాంధీ జయంతి

విజన్ బిల్డింగ్‌పై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన

గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు



నాగిరెడ్డిపేట,అక్టోబర్ 2: మండల సమాఖ్య కార్యాలయంలో ఎన్ఆర్ఎల్ఎం ఆధ్వర్యంలో మండల సమాఖ్య సభ్యులు, వీవోఏలు, సీసీలకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్స్ కవిత, రమాదేవి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఏపీఎం దత్తు, సమాఖ్య అధ్యక్షురాలు శాంత సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజుల, సీసీలు, వీవోఏలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారు..

- సబ్ జైలులో ఘనంగా గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శిల్ప



పరిగి, అక్టోబర్ 3 (తెలంగాణ డైలీ న్యూస్) :

అక్టోబర్ 2న గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పరిగి సబ్ జైలులో సూపరింటెండెంట్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శిల్ప, పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కొండల్ రెడ్డి, జిల్లా న్యాయ సేవా సంస్థ డిఫెన్స్ కౌన్సెల్ వెంకటేష్, రాము, పరిగి కోర్ట్ లీగల్ న్యాయవాది గౌస్ పాషా, పరిగి కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు భక్త కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్ మాట్లాడుతూ, జైళ్లలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టామన్నారు. ముఖ్యంగా నాణ్యమైన భోజనం అందించడం, చదువు రాని ఖైదీలకు చదువు నేర్పించడం, బ్యాంకు ఖాతాలు లేని వారికి ఖాతాలు తెరవడం, ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు న్యాయ సేవా సంస్థ ద్వారా బెయిల్ ఇప్పించడం వంటివి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే శారీరక ఆరోగ్యం కోసం పి.టి., పరేడ్, యోగ, వారానికి రెండు సార్లు వైద్య పరీక్షలు, మానసిక ఉల్లాసం కోసం ఆటలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శిల్ప మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ గాంధీ చూపిన అహింసా మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారని, చుట్టూ ఉండే పరిస్థితులే వారిని నేరస్తులను చేస్తాయని అన్నారు. ముఖ్యంగా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, మంచివారితో స్నేహం మంచి మార్గంలో నడిపిస్తుందని చెప్పారు. కోపమే శత్రువు, శాంతమే రక్ష అని, ప్రతి ఒక్కరూ ఓర్పు, సహనం కలిగి ఉండాలన్నారు. క్షణికావేశంలో చేసే చిన్న పొరపాట్లు తీవ్ర నష్టాలను తెస్తాయని, వాటిని పునరావృతం చేయడమే నేరమని తెలిపారు. చేసిన తప్పుల వల్ల కుటుంబ సభ్యులు మానసిక వేదనకు, ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని హెచ్చరించారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమత లేని పేద ఖైదీలకు జిల్లా న్యాయ అధికార సంస్థ ద్వారా ఉచితంగా ప్రభుత్వ లాయర్‌ను కేటాయించి బెయిల్ మంజూరు చేయిస్తామని తెలిపారు. అనంతరం ఖైదీలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది హెడ్ వార్డర్ సుధాకర్, వార్డర్లు రాజు, నరేష్, హరికృష్ణ, విద్యా వాలంటీర్ చుక్కాని బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై అనిల్‌కుమార్ సూచన

ఎల్లూరులో ప్రత్యేక గ్రామసభ



కొమరం భీం, అక్టోబర్ 2: పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఎస్సై అనిల్‌కుమార్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి, మాజీ సర్పంచ్, ఐకేపీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

: ప్రపంచ కప్ షెడ్యూల్లో బిగ్ ట్విస్ట్ ఇచ్చిన ఐసీసీ.. అదేంటంటే ?



ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శుభవార్త రానే వచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్ టోర్నీకి సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కేప్ టౌన్ వేదికగా అత్యంత వైభవంగా ఆవిష్కరించింది. ఈ ప్రధాన ఘట్టంతో ఈ మెగా టోర్నీకి సరిగ్గా ఒక ఏడాది కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. ఈ వేదుకలోనే అధికారికంగా మ్యాచ్‌ల తేదీలతో పాటు టికెట్ల కేటాయింపు ప్రక్రియ కూడా ప్రారంభించింది. ఈసారి 2027 వన్డే వరల్డ్ కప్‌ను సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈసారి టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటుండగా, 12 వేదికలపై 57 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక టోర్నమెంట్ ఫార్మాట్‌లోనూ ఐసీసీ కొన్ని కీలక మార్పులు చేసింది. గ్రూప్ దశ తర్వాత కొత్తగా సూపర్ 7 స్టేజ్‌ను పరిచయం చేశారు. ఈ టోర్నీ వచ్చే ఏడాది అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభమై, నవంబర్ 21న ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది.వన్డే ప్రపంచకప్‌కు సంబంధించిన గ్రూపులను ×జజ ప్రకటించింది.గ్రూప్ ూా:ఆఫ్ఘనిస్థాన్, ఆస్ట్రేలియా, భారత్, పాకిస్థాన్, జింబాబ్వే, క్వాలిఫయర్ ూాగ్రూప్ దీ:బంగ్లాదేశ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్, క్వాలిఫయర్ దీమారిన టోర్నమెంట్ స్వరూపంఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్ 2027లో ప్రధానంగా జట్ల సంఖ్యతో పాటు టోర్నీ నిర్వహణ విధానమే పూర్తిగా మారింది. గత 2023 ప్రపంచకప్‌లో 10 జట్లు ఒకే లీగ్ విధానంలో ఒక్కో జట్టుతో ఆడగా, 2027లో 14 జట్లను తీసుకొచ్చి మూడు దశల కొత్త ఫార్మాట్‌ను అమలు చేస్తున్నారు. మొదట ర్యాంకింగ్స్‌లో 12, 13, 14 స్థానాల్లో ఉన్న మూడు జట్లు సూపర్ సిరీస్‌లో రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. అందులో విజేత ప్రధాన గ్రూప్ దశలోకి వెళ్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపులో ఆరు జట్లతో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్రతి గ్రూప్‌లోని అగ్ర మూడు జట్లతో పాటు రెండు గ్రూపుల్లో తదుపరి అత్యుత్తమ రికార్డు ఉన్న మరో జట్టు కలిపి ఏడు జట్లు సూపర్ 7 దశకు చేరతాయి.అసలు కీలకమైన మార్పు సూపర్ 7 దశలోనే ఉంటుంది. ఏడు జట్లు మరోసారి రౌండ్ రాబిన్ విధానంలో తలపడతాయి. ఇక్కడ

వన్డే హిస్టరీలో ఆల్‌టైం టాప్ 7 భారీ స్కోర్లు



ఇటీవల గౌహతి వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించింది. విండీస్ జట్టు 400 దాటినా మ్యాచ్ ఓడిపోవడం విశేషం. అయితే వన్డే క్రికెట్ చరిత్రలో 400 కంటే ఎక్కువ పరుగులు నమోదు కావడం ఇదే తొలిసారి కాదు. వన్డే ఫార్మాట్‌లో అత్యంత వేగవంత మైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను చిత్తు చేస్తూ నమోదైన టాప్ 7 భారీ స్కోర్ల వివరాలు చూద్దాం.1. ఇగ్లాండ్ -- 498/4 (వర్సెస్ నెదర్లాండ్స్, 2022
పురుషుల వన్డే అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక జట్టు స్కోరు రికార్డు ఇంగ్లాండ్ పేరిట ఉంది. 2022లో నెదర్లాండ్స్‌పై ఇంగ్లీష్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి ఏకంగా 498 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో జోస్ బట్లర్ కేవలం 70 బంతుల్లోనే 162 పరుగులతో నాటౌటగా నిలిచి విరు చుకుపడ్డారు.2. ఇంగ్లాండ్ -- 481/6 (వర్సెస్ ఆస్ట్రేలియా, 2018)
రెండో స్థానంలో కూడా ఇంగ్లాండ్ జట్టే కొనసాగుతోంది. 2018లో ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ 6 వికెట్లు కోల్పోయి 481 పరుగుల భారీ స్కోరు సాధించింది. అలెక్స్ హేల్స్, జానీ బెయిర్‌స్టో చెలరేగి సెంచరీలు సాధించడంతో ఈ కొండంత స్కోరు నమోదైంది.
3. ఇంగ్లాండ్ -- 444/3 (వర్సెస్ పాకిస్థాన్, 2016)
ఈ లిస్టులో మూడో స్థానాన్ని కూడా ఇంగ్లాండే సొంతం చేసుకుంది. 2016లో పాకిస్థాన్‌పై ఇంగ్లీష్ టీం 3 వికెట్ల నష్టానికి 444 పరుగులు రాబట్టింది. ఆ మ్యాచ్‌లో అలెక్స్ హేల్స్ 171 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టు భారీ స్కోరు సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు.
4. శ్రీలంక -- 443/9 (వర్సెస్ నెదర్లాండ్స్, 2006)
నాలుగో స్థానంలో శ్రీలంక నిలిచింది. 2006లో నెదర్లాండ్స్‌పై లంక జట్టు 9 వికెట్లకు 443 పరుగులు చేసింది. దాదాపు పదేళ్ల పాటు ప్రపంచ వన్డే చరిత్రలోనే అత్యధిక టీమ్ టోటల్‌గా ఈ స్కోరు చెక్కుచెదరకుండా నిలవడం విశేషం.5. సౌతాఫ్రికా -- 439/2 (వర్సెస్ వెస్టిండీస్, 2015)
ఐదో స్థానాన్ని సౌతాఫ్రికా దక్కించుకుంది. 2015లో వెస్టిండీస్‌తో జరిగిన

టీమిండియాలో ఎవరీ టీటీవీ నంబూరి.. ఆసియా క్రీడల్లో విచిత్రం

రిజిస్ట్రేషన్ పేర్లను ప్రదర్శించడంతో ఈ గందరగోళం తలెత్తింది.మరికొంత మంది ఆటగాళ్ల పేర్లలో మార్పులు
కేవలం తిలక్ వర్మ మాత్రమే కాకుండా



ఆసియా క్రీడల్లో భాగంగా భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగిన కీలకమైన సెమీఫైనల్ మ్యాచ్‌తో పాటు మరో ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. మైదానంలో ఆటగాళ్ల ప్రదర్శన కంటే బ్రాడ్‌కాస్టర్ చూపించిన స్కోర్‌బోర్డ్ గ్రాఫిక్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి. సాధారణంగా క్రికెట్ ప్రపంచంలో సుపరిచితమైన షార్ట్ నేమ్స్‌తో కనిపించే ఆటగాళ్లు, ఈ టోర్నమెంట్‌లో మాత్రం పూర్తిగా కొత్త పేర్లతో దర్శనమిచ్చారు.ఎవరు ఈ టీటీవీ నంబూరి? భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ పేరు స్క్రీన్‌పై ు. కనిపించడంతో అభిమానులు ఒక్కసారిగా కన్ఫ్యూజన్‌కు గురయ్యారు. అసలు ఈ కొత్త ఆటగాడు ఎవరంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు రకరకాల ప్రశ్నలు లేవనెత్తారు. తిలక్ వర్మ పూర్తి పేరు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ కాగా, ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం పాస్‌పోర్ట్ లేదా అధికారిక మరికొందరు భారతీయ ఆటగాళ్ల పేర్లు కూడా ఇలాగే భిన్నంగా ప్రదర్శించబడ్డాయి. వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ పేరు ఎస్ విశ్వనాథ్ తరహాలో అధికారిక డాక్యుమెంట్ల పేర్లతో స్కోర్‌బోర్డ్‌లో కనిపించాడు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు అలాగే కామన్వెల్త్ గేమ్స్ వంటి మల్టీ-స్పోర్ట్స్ ఈవెంట్లలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిబంధనల ప్రకారం అథ్లెట్ల పూర్తి అధికారిక పేర్లనే వాడాల్సి

హోమ్ లోన్ ఱం ప్రాపర్టీ లోన్.. మీకు ఏది బెస్ట్..? ఈ చిన్న తప్పులతో జేబుకు చిల్లే..!



మనిషి జీవితంలో ఆర్థిక భద్రతను నిర్మించుకోవడంలో స్థిరాస్తుల కొనుగోలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికో లేదా ఇప్పటికే ఉన్న ఆస్తుల విలువ ఆధారంగా తక్షణ అవసరాలకు డబ్బుల కోసం బ్యాంకులు ప్రధానంగా రెండు రకాల లోన్ సౌకర్యాలను అందిస్తున్నాయి. అవే హోమ్ లోన్, ప్రాపర్టీ లోన్. ఈ రెండింటి నిబంధనలు పూర్తిగా వేర్వేరు కాబట్టి మీ ప్రస్తుత అవసరానికి తగినదాన్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. హోమ్ లోన్ అనేది కొత్తగా ఒక ఇంటిని, ప్లాట్‌ను కొనడానికి లేదా సొంత స్థలంలో నూతన ఇళ్లు నిర్మించుకోవడానికి మాత్రమే బ్యాంకులు మంజూరు చేసే లోన్. దీనిని పొందడానికి దరఖాస్తుదారుడికి మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో పాటు లోన్ సకాలంలో చెల్లించగల స్థిరమైన ఆదాయం ఉండటం తప్పనిసరి. బ్యాంకుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా హోమ్ లోన్లకు వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో పాటు 20 నుంచి 30 సంవత్సరాల వరకు సుదీర్ఘ కాలవ్యవధిలో రీపేమెంట్ చేసుకునే వెసులుబాటు లభిస్తుంది.
మరోవైపు ఆస్తిపై లోన్ అనేది ఇప్పటికే మీ పేరిట ఉన్న నివాస లేదా వాణిజ్య స్థలాన్ని బ్యాంకు వద్ద తాకట్టు పెట్టి నగదు పొందే పద్ధతి. ఇందులో వచ్చే నిధులను ఇంటి నిర్మాణానికే కాకుండా వ్యాపార విస్తరణ, ఉన్నత చదువులు, వివాహ ఖర్చులు లేదా అత్యవసర వైద్య ఖర్చుల వంటి ఏ అవసరానికైనా ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ లోన్‌లో మీ ఆస్తి మార్కెట్ విలువను బట్టి మాత్రమే డబ్బులు వస్తాయి. ఉదాహరణకు మీ ఆస్తి విలువ రూ.1 కోటి ఉంటే బ్యాంకు రూల్స్ ప్రకారం రూ. 50 లక్షల నుండి రూ. 70 లక్షల వరకే లోన్ లభిస్తుంది తప్ప పూర్తి కోటి రూపాయలు ఇవ్వరు. ఈ రెండింటిలో ఏది మీకు సరైనదో తేల్చుకోవడానికి మీ అవసరమే గీటురాయి. మీరు కొత్తగా ఇంటిని తీసుకోవడం లేదా సొంత స్థలంలో కట్టుకోవాలనుకుంటే తక్కువ వడ్డీకే లభించే హోమ్ లోన్ బెస్ట్ ఆప్షన్. అలా కాకుండా ఇప్పటికే మీ వద్ద ఉన్న ఫ్లాట్ లేదా ఖాళీ స్థలాన్ని ఉపయోగించి కొత్త వ్యాపారం ప్రారంభించాలన్నా, లేదా పెద్ద మొత్తంలో డబ్బు అవసరమైనా దాన్నిపై లోన్ తీసుకోవడం సరైన అవుతుంది.

యూపీఐ ఛార్జీలు తప్పించుకోవడానికి ఈ ట్రిక్ ఫటిస్తే అంతే సంగతులు..



ఇప్పటివరకు యూపీఐ లావాదేవీలు ఉచితంగా చేసుకునే వెసులుబాటు ఉండేది. కానీ ఇంకొద్ది రోజుల్లో యూపీఐ లావాదేవీలకు ఛార్జీలు పడనున్నాయి. అవును.. అక్టోబర్ 15వ నుండి కొత్త ూ× నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ కొత్త ూ× నిబంధనల ప్రకారం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన ూ× మర్చంట్ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక కస్టమర్ రూ.3,000 బిల్లు చెల్లించినట్లయితే.. వ్యాపారికి రూ.12 వీణ= ఛార్జ్ పడుతుంది. ఈ వీణ= అనేది వ్యాపారి వైపున వర్తించే ఛార్జ్‌గా చెప్పవచ్చు. దీనిని కస్టమర్లపైకి బదిలీ చేయకూడదు. అయితే కొన్ని సందర్భాల్లో వ్యాపారులు ఈ అదనపు ఛార్జీలను కస్టమర్ల నుండి వసూలు చేయడానికి ప్రయత్నించవచ్చు. అలాంటి సమయంలో కస్టమర్లు, వ్యాపారులు ఇద్దరూ వీణ= ఛార్జీల భారం నుండి తప్పించుకోవడానికి ఒక సులభమైన ఆలోచన చేస్తున్నారు. అదేంటి అంటే.. రూ.2,000 కంటే ఎక్కువ మొత్తంలో చేసే లావాదేవీలను చిన్న మొత్తాలుగా విభజించి చెల్లించడం ద్వారా ఈ ఛార్జీలను నివారించవచ్చని యోచిస్తున్నారు.చిక్కుల్లో పడే అవకాశం..ఉదాహరణకు రూ.3,000 చెల్లించాల్సి వస్తే.. ఆ మొత్తాన్ని రెండు రూ.1,500 లావాదేవీలుగా విభజించి చెల్లించవచ్చు. ఒక్కో లావాదేవీ రూ.2,000 కంటే తక్కువగా ఉండటం వల్ల వీణ= ఛార్జ్ వర్తించదు. ఈ పద్ధతి ద్వారా కస్టమర్, వ్యాపారి ఇద్దరూ అదనపు ఛార్జీలు చెల్లించకుండా డిజిటల్ చెల్లింపుల ప్రయోజనాలను పొందవచ్చు. వీణ= ఛార్జీల అప్లికేబిలిటీ, రేట్లు వ్యాపారి వర్గం, వర్తించే నిబంధనలపై ఆధారపడి మారవచ్చు. అయితే అలా విభజించి యూపీఐ పేమెంట్ చేయడం వల్ల ఇబ్బందులు వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. తక్కువ వ్యవధిలో ఒకే వ్యాపారికి పదేపదే ఒకే మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయడం వల్ల బ్యాంకు మోసాల పర్యవేక్షణ వ్యవస్థ దీనిని అసాధారణమైనదిగా పరిగణించవచ్చని చెబుతున్నారు. బ్యాంకులు ఎప్పటికప్పుడు వినియోగదారుల లావాదేవీలను పర్యవేక్షిస్తాయి. ఒక వినియోగదారుడు తక్కువ వ్యవధిలో ఒకే వ్యాపారికి పదేపదే తక్కువ సమయంలో డబ్బులు పంపడం వల్ల చిక్కులు ఎదురుకావొచ్చు.ఇలాంటి సందర్భాల్లో లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉంటుంది. లేదా యూపీఐ సేవను తాత్కాలికంగా నిలిపివేసే ప్రమాదముంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే కొన్ని బ్యాంకులు రోజువారీ లావాదేవీలపై పరిమితులు విధిస్తాయి. మీరు ఒకే దుకాణాదారుడికి నాలుగుసార్లు లావాదేవీలు చేయడం వల్ల మీ లిమిట్ అయిపోతుంది. దీని వల్ల వేరేవారికి పేమెంట్స్ చేయలేరు. అయితే ఇలాంటి ఎత్తుగడలను నివారించేందుకు యూపీఐ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చే అవకాశం భవిష్యత్తులో ఉంటుంది. అదనపు భద్రతా వ్యవస్థలను ప్రవేశపెట్టే

బంగారం ధరల్లో ఊహించని మార్పులు.. హైదరాబాద్, విజయవాడలో తులం ఎంతుందంటే..



బంగారం, వెండి ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి.. ఇటీవల భారీగా పెరిగిన ధరలు.. మళ్లీ తగ్గి కాస్త ఊరటనిచ్చాయి.. గత వారం రోజుల నుంచి ధరలను పరిశీలిస్తే.. దాదాపు రూ.5వేల వరకు తగ్గింది. అంతర్జాతీయంగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులతో మార్పులు జరుగుతున్నట్లు బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో గోల్డ్ రేట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా శుక్రవారం (అక్టోబర్ 2) ఉదయం 6 గంటల వరకు దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.
24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై 10 తగ్గి.. రూ.1,49,230 గా ఉంది.
22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధరపై 10 తగ్గి.. రూ.1,36,790 గా ఉంది.
వెండి కిలో ధరపై 100 తగ్గి.. రూ.2,34,900 లుగా కొనసాగుతోంది.
అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.
హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.
విజయవాడలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,49,400, 22 క్యారెట్ల ధర రూ.1,36,940 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,790 ఉంది. వెండి కిలో ధర రూ.2,39,900 ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర

కెరీర్ పీక్‌లో ఉండగానే ప్రమాదం.. ఎనిమిది నెలలపాటు మంచానికే పరిమితం



తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు సంపాదించారు. స్నేహ అసలు పేరు సుహాసిని. తమిళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారథి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారథి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో స్నేహకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. అయితే స్నేహ కెరీర్‌లో జరిగిన ఓ సంఘటన ఆమెను కుంగదీసిందట. కెరీర్ మంచి స్థాయిలో

ఆ హీరో అంటే నాకు పిచ్చి.



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి కాజల్ అగర్వాల్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తెలుగు, తమిళ చిత్రాల్లో ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించిన ఆమె.. తన అందం, అభినయంతో భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితానికీ సమయం కేటాయిస్తున్న కాజల్.. గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ సందర్భంగా సౌత్ సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లను గ్లామర్ పరంగా చూపించే విధానంపై కాజల్ స్పందించారు. ముఖ్యంగా కథతో సంబంధం లేకుండా హీరోయిన్ల నడుమును చూపించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారనే అభిప్రాయంపై ఆమెను ప్రశ్నించగా.. గతంలో ఇలాంటి అపోహలు ఉండి ఉండొచ్చు కానీ ఇప్పుడు పరిస్థితులు క్రమంగా మారుతున్నాయని కాజల్ పేర్కొంది. ప్రేక్షకుల అభిరుచులతో పాటు ఇండస్ట్రీలో కూడా చాలా మార్పులు వచ్చాయని కాజల్ అంది. ఈ సందర్భంగా సౌత్ సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లను గ్లామర్ పరంగా చూపించే విధానంపై కాజల్ స్పందించారు. ముఖ్యంగా కథతో సంబంధం లేకుండా హీరోయిన్ల నడుమును చూపించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారనే అభిప్రాయంపై ఆమెను ప్రశ్నించగా.. గతంలో ఇలాంటి అపోహలు ఉండి ఉండొచ్చు కానీ ఇప్పుడు పరిస్థితులు క్రమంగా మారుతున్నాయని కాజల్ పేర్కొంది. ప్రేక్షకుల అభిరుచులతో పాటు ఇండస్ట్రీలో కూడా చాలా మార్పులు వచ్చాయని కాజల్ అంది. ప్రస్తుతం సినిమాల్లో మహిళా పాత్రలకు, కథలో వారి ప్రాధాన్యానికి కూడా ఎక్కువ స్థానం లభిస్తోందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఇక ఇదే ఇంటర్వ్యూలో కాజల్‌కు ఎదురైన మరో ఆసక్తికరమైన ప్రశ్న ఆమె ఫేవరెట్ హీరో గురించి. మీకు ఇష్టమైన హీరో ఎవరు.? అని అడగ్గా.. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ పేరు చెప్పింది ఈ అందాల తార. చిన్నప్పటి నుంచే సల్మాన్ ఖాన్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయనే తన క్రష్ అని కాజల్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం సినిమాల్లో మహిళా పాత్రలకు, కథలో వారి ప్రాధాన్యానికి కూడా ఎక్కువ స్థానం లభిస్తోందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఇక ఇదే ఇంటర్వ్యూలో కాజల్‌కు ఎదురైన మరో ఆసక్తికరమైన ప్రశ్న ఆమె ఫేవరెట్ హీరో గురించి. మీకు

ఓటీటీలోకి వచ్చేసిన కార్తీ లేటస్ట్ యాక్షన్ స్పై యాక్షన్ థ్రిల్లర్..



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ నటించిన లేటెస్ట్ స్పైయాక్షన్ థ్రిల్లర్ సర్దార్ 2. సుమారు నాలుగేళ్ల క్రితం (2022)లో రిలీజై బ్లాక్ బస్టర్ గా నిలిచిన సర్దార్ సినిమాకు సీక్వెల్ గా సర్దార్ 2 తెరకెక్కింది. మొదటి భాగాన్నే తెరకెక్కించిన దర్శకుడు పీఎస్ మిత్రనే రెండో భాగానికి కూడా దర్శకత్వం వహించాడు. కార్తీ సరసన మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లు నటించారు. అలాగే విలక్షణ నటుడు ఎస్జే సూర్య విలన్ గా నటించడం విశేషం. ఇలా స్టార్ క్యాస్టింగ్ కు తోడు గ్లింప్స్, ట్రైలర్ తో రిలీజ్ కు ముందు సర్దార్ 2 పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అలాగే హీరో కార్తీ, ఎస్జే సూర్య భారీగా ప్రమోషన్ కార్యక్రమాలు చేపట్టారు. అయితే తీరా థియేటర్లలోకి అడుగు పెట్టాక సర్దార్ 2 అభిమానుల అంచనాలు అందుకోలేకపోయింది. ఈనెల 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజైన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీకి మిక్స్ డ్ టాక్ వచ్చింది. తమిళంలో ఓ మాదిరి కలెక్షన్లు వచ్చినప్పటికీ తెలుగులో ఈ సినిమాకు చాలా తక్కువ వసూళ్లు వచ్చాయి. అయితే ఉన్నంతలో డబుల్ రోల్ లో కార్తీ నటన, ఎస్జే సూర్య విలనిజం అభిమానులను మెప్పించాయి. థియేటర్లలో పెద్దగా ఆడని సర్దార్ 2 సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది.సర్దార్ 2 సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. అక్టోబర్ 01 నుంచే ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్లు ఇదివరకే ఓటీటీ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అందుకు తగ్గట్టుగానే గురువారం అర్ధరాత్రి నుంచే ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కు వచ్చేసింది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లోనూ సర్దార్ 2 సినిమా అందుబాటులోకి వచ్చింది.

తత్వం మూవీ రివ్యూ



పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్ డ్యూటీ చేసే కళ్యాణ్ (దినేష్ తేజ్) సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలని కలలు కంటుంటాడు. ఎగ్జామ్ రాసి రిజల్ట్స్ కోసం వెయిట్ చేసే టైమ్‌లో పెళ్లి చూపుల నిమిత్తం రామాపురం ఊరికి వెళ్తాడు. అక్కడ సౌమ్య (దష్టిక)ను చూసిన వెంటనే ఇష్టపడతాడు. అదే ఊళ్లో మూర్తి, నాగమణి అనే భార్యాభర్తలు వ్యవసాయం మీద బతుకుతుంటారు. వాళ్ల కొడుకు సుధ మానసిక స్థితి సరిగ్గా ఉండదు. అనుకోని పరిస్థితుల్లో ఆ వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురవుతారు. మానసిక రోగి అయిన సుధనే వాళ్లను చంపాడని ఊరి జనాలు అతడిని కొడతారు. ఈ గొడవ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడంతో, ఆ ఊరికి వచ్చిన కళ్యాణ్ చేతికి ఈ కేసు దర్యాప్తు వస్తుంది. అసలు ఆ భార్యాభర్తలను చంపిందెవరు, సుధ నిజంగానే హంతకుడా, ఈ మిస్టరీని కళ్యాణ్ ఎలా చేధించాడు, సౌమ్యతో అతడి పెళ్లి జరిగిందా అనేది ఈ మూవీ స్టోరీ.కథనంఈ చిత్రాని కేవలం ఓ మామూలు మర్డర్ మిస్టరీలా కాకుండా, మనిషి ఆలోచనా విధానం, నమ్మకం, నిజానిజాలు లాంటి అంశాలను జోడించి కాస్త కొత్తగా చెప్పే ప్రయత్నం చేశారు దర్శకుడు అర్జున్ కోలా. ఒక పక్క మర్డర్ కేసు దర్యాప్తు సాగుతుండగానే, మరో పక్క తాత్విక కోణాన్ని టచ్ చేస్తూ సినిమాను నడిపించారు. ఒక వ్యక్తి ప్రవర్తన సరిగ్గా లేనంత మాత్రాన, పరిస్థితులను బట్టి అతడే నేరం చేశాడని గుడ్డిగా నమ్మేయడం కరెక్టేనా అనే పాయింట్‌ను సుధ క్యారెక్టర్ ద్వారా బలంగా చూపించారు. ఊరి జనాల అనుమానాలు, పోలీసుల ఎంక్వైరీ, అసలు నిజాన్ని రాబట్టేందుకు హీరో చేసే పోరాటం ఆకట్టుకుంటుంది. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఒక పెద్ద కేసును డీల్ చేసే బాధ్యతాయుతమైన రోల్‌లో హీరో జర్నీ ఆసక్తిని రేకెత్తిస్తుంది. అలాగే హీరోయిన్ ట్రాక్ కూడా కథకు బాగానే సింక్ అయింది. క్రైమ్ థ్రిల్లర్‌కు ఆధ్యాత్మికత, వేదాంతం లాంటివి మిక్స్ చేయడం మంచి ప్రయోగమే అయినా, ఇలాంటి కథలకు నెరేషన్ చాలా గ్రిప్పింగ్‌గా ఉండాలి. కానీ దర్శకుడు కొన్ని చోట్ల సాగదీతకు గురి చేశాడు. సీన్స్ చాలా నెమ్మదిగా సాగడం వల్ల ఆడియన్స్‌కు కాస్త బోర్ కొడుతుంది. క్లైమాక్స్ ట్విస్టులు, ఇన్వెస్టిగేషన్ సీన్స్ రాసుకున్న తీరు బాగున్నా, కథనంలో స్పీడ్ పెంచి ఉంటే రిజల్ట్ మరోలా ఉండేదినటీనటులునిస్టేబుల్ కళ్యాణ్ రోల్‌లో దినేష్ తేజ్ చాలా చక్కగా సెట్ అయ్యాడు. తన యాక్టింగ్‌తో క్యారెక్టర్‌కు మంచి డెప్త్ తీసుకొచ్చాడు. పల్లెటూరి అమ్మాయి సౌమ్యగా దష్టిక తన క్యూట్ లుక్స్‌తో, క్యూట్ పర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. మెంటల్ కండిషన్ సరిగ్గా లేని సుధ పాత్ర చేసిన నటుడు తన పాత్రకు పూర్తిగా న్యాయం చేశాడు. మిగిలిన సపోర్టింగ్ ఆర్టిస్టులు కూడా తమ పాత్రల పరిధి మేరకు బాగానే నటించి మెప్పించారు.

బిగ్‌బాస్‌లో ఈ వారం డబుల్ ఎలిమినేషన్..



బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 రసవత్తరంగా, ఆసక్తికరంగా సాగుతోంది. ముఖ్యంగా కంటెస్టెంట్స్, ఆడియెన్స్ అంచనాలకు అందుకోకుండా బిగ్ బాస్ భలే ట్విస్టులు ఇస్తున్నాడు. సెప్టెంబర్ 07న ప్రారంభమైన ఈ రియాలిటీ షో ఇప్పటికే సక్సెస్ ఫుల్ గా మూడు వారాలు పూర్తి చేసుకుంది. ఇప్పుడు నాలుగో వారం ఎండింగ్ కు కూడా చేరుకుంది. కాబట్టి ఈ వారం ఎవరు ఎలిమినేట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.బిగ్ బాస్ మొదటి వారం లో చైత్ర ఎలిమినేట్ అయ్యింది. ఆ తరవాత రెండవ వారం లో నటుడు కృష్ణుడు ఎలిమినేటయ్యి హౌస్ నుంచి బయటకు వచ్చేశాడు. ఇక మూడో వారం ముఖేష్ త్యాగం కారణంగా ఎలిమినేషన్ జరగలేదు. దీంతో నాలుగో వారంలో డబుల్ ఎలిమినేషన్ ఉండనుందని తెలుస్తోంది. నాలుగో వారం ఎలిమినేషన్ కు సంబంధించి మొత్తం తొమ్మిది మంది కంటెస్టెంట్లు నామినేషన్స్‌లో ఉన్నారు. ముఖేష్ గౌడ, త్రిగుణ్, దేబ్జానీ, రోహిత్, షాలిని, అమన్, నరేష్, చరణ్, సృష్టి ఈ వారం ఎలిమినేషన్‌ను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతమున్న ఓటింగ్ ట్రెండ్స్ ను ఒకసారి పరిశీలిస్తే.. స్టార్ కంటెస్టెంట్ త్రిగుణ్ కు భారీగా ఓట్లు పడుతున్నాయి. దీంతో ఇప్పుడు అతను టాప్ ప్లేస్ లో కొనసాగుతున్నాడు. గత వారం కంటే ఈ వారం ఓటింగ్‌లోనే త్రిగుణ్ కు భారీ మద్దతు లభిస్తోంది. త్రిగుణ్ తర్వాత 13.17 శాతం ఓట్లతో రోహిత్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక హౌస్ లో నిలకడైన ఆట, మాట తీరుతో ఆకట్టుకుంటోన్న సీరియల్ నటుడు ముఖేష్ కు రోజు రోజుకు ఫ్యాన్ బేస్ పెరుగుతోంది. మొన్నటి వరకు ఐదో స్థానంలో ఉన్న ముఖేష్ ప్రస్తుతం మూడో స్థానానికి చేరుకున్నాడు. వీరి తర్వాత జబర్దస్త్ నాలుగో ప్లేస్ లో ఉన్నాడు. అలాగే ఐదో స్థానంలో అమన్ మసూద్, ఆరో స్థానంలో శాలినీ, ఏడో ప్లేసులో దేబ్జానీ, ఎనిమిదో స్థానంలో చరణ్, తొమ్మిదో ప్లేసులో సృష్టి ఉన్నారు.

అంటే ప్రస్తుతం చరణ్, సృష్టి డేజర్ జోన్ లో ఉన్నారన్నమాట. నిజానికి రెండవ వారమే కృష్ణుడు స్థానంలో సృష్టి ఎలిమినేట్ కావాల్సి ఉండగా.. కృష్ణుడిని ఆడియన్స్ మొదట ఎలిమినేట్ చేశారు. దీనికి తోడు సుధీర్ పట్ల ఆమె వ్యవహరించిన తీరు కారణంగా సోషల్ మీడియాలో బాగా ట్రోలింగ్ కు గురైంది సృష్టి. కాబట్టి ఈ వారంలో సృష్టినే ఎలిమినేట్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలుస్తోంది. ఒక వేళ డబుల్ ఎలిమినేషన్ జరిగితే.. చరణ్ కూడా బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వెళ్లే అవకాశం ఉంది. మొదటి వారం మిడ్ వీక్ ఎలిమినేషన్ లో భాగంగా ఎలిమినేట్ అయిన చరణ్ కు మళ్ళీ వారం ఆయనకు రెండవ అవకాశం కల్పించారు. అయితే ఈ అవకాశాన్ని కూడా చరణ్ సరిగా ఉపయోగించుకోలేకపోతున్నాడు. దీనికి తోడు ఝాన్సీపై అతను చేసిన వ్యాఖ్యలు తీవ్రమైన నెగెటివిటీని తీసుకొచ్చాయి.

ఎనిమిదేళ్లు అతన్ని పిచ్చిగా ప్రేమించా.. చివరకు మోసం చేశాడు :



తెలుగు టెలివిజన్ లో కామెడీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన షోల్లో జబర్దస్త్ ఒకటి. ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మంది కమెడియన్లు, నటులు వెలుగులోకి వచ్చారు. కొందరు సినిమాల్లో నటులుగా, మరికొందరు దర్శకులుగా తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక జబర్దస్త్‌లో లేడీ గెటప్స్‌తో ప్రేక్షకులను నవ్వించిన పలువురు ఆర్టిస్టుల్లో తన్మయి కూడా ఒకరు. తన ప్రత్యేకమైన కామెడీ టైమింగ్‌తో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. జబర్దస్త్‌తో పాటు ఇతర టీవీ కార్యక్రమాలు, ఈవెంట్లలోనూ కనిపిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న తన్మయి.. గతంలో ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించారు.తెరపై నవ్వులు పంచే తన వెనుక ఎన్నో కన్నీళ్లు, కష్టాలు, ఒంటరి పోరాటం ఉంది. చిన్నతనం నుంచే తమ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొందని తన్మయి వెల్లడించారు. చదువుపై ఆసక్తి ఉన్న తనకు డాక్టర్ కావాలనే కోరిక ఉండేదని తెలిపారు. బైపీసీ చదివి వైద్య రంగంలోకి వెళ్లాలని అనుకున్నప్పటికీ, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అందుకు సహకరించలేదని చెప్పారు. చివరకు డిగ్రీ వరకు చదువును కొనసాగించగలిగానని వివరించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా చిన్న వయసులోనే సంపాదనపై దృష్టి పెట్టాల్సి వచ్చిందని ఆమె తెలిపారు.తెరపై నవ్వులు పంచే తన వెనుక ఎన్నో కన్నీళ్లు, కష్టాలు, ఒంటరి పోరాటం ఉంది. చిన్నతనం నుంచే తమ కుటుంబం

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.